



రేణూ దేశాయ్, అభిషేక్ అగర్వాల్, వంశీ, రవితేజ, నూపుర్ సనన్

## అతనిలో ఈ కోణాన్ని ఊహించలేదు

'వంశీ ఈ కథ చెప్పినప్పుడు చాలా ఎక్సయిట్ అయ్యాను. అతన్నుంచి ఇలాంటి కోణాన్ని ఊహించలేదు. ఎంత అద్భుతంగా చెప్పాడో, అంతకంటే అద్భుతంగా తీశాడు' అని రవితేజ అన్నారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. నూపుర్ సనన్, గాయత్రి భరద్వాజ్ కథానాయికలు. రేణూదేశాయ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో రవితేజ మాట్లాడారు. 'అబ్బురపరిచే సాంకేతికతో రూపొందిన సినిమా ఇది. ప్రతి బ్లాకూ వండర్ అనేలా ఉంటుంది. రియల్ లొకేషన్లో సినిమా తీయడం వల్ల ఎమోషన్స్ కూడా బాగా క్యారీ అయ్యాయి. అన్ని వర్గాలకూ నచ్చే సినిమా అవుతుంది' అని రవితేజ నమ్మకం వ్యక్తం చేశారు. 'ఈ సినిమాతో మాది నాలుగేళ్ల ప్రయాణం. ఈ నెల 20న విడుదలవుతున్నది. ఏమాత్రం ఒత్తిడి లేదు. ఎందుకంటే సినిమా చూశాను. అందరూ ఊహించినదానికి మించి ఉంటుంది. తెలుగు చిత్ర పరిశ్రమలో 'టైగర్ నాగేశ్వరరావు' బెస్ట్ ఫిల్మ్ అవుతుంది' అని దర్శకుడు వంశీ అన్నారు. ఇంకా చిత్ర యూనిట్ సభ్యులతో పాటు రచయిత విజయేంద్ర ప్రసాద్, హరీశ్ శంకర్, మలినేని గోపీచంద్, నాగవంశీ, టి.జి.విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల, మిరియాల రవీందర్‌రెడ్డి మాట్లాడారు.

చిత్రం



## ఫోన్ పోగొట్టుకుంది

టాలీవుడ్‌లోనే కాదు, అన్ని భాషల్లోనూ ఐటెం సాంగ్స్‌కి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది ఊర్వశి రౌథేలా. ఇప్పుడు ఈ ముద్దుగుమ్మకు ఎక్కడలేని కష్టం వచ్చిపడింది. వరల్డ్‌కప్ టోర్నీలో భాగంగా జరిగిన ఇండో పాక్ మ్యాచ్ చూడ్డానికి ఈ అందాల భామ స్టేడియంకి వెళ్లింది. అక్కడ ఆనందంతో గంతులేసిందేమోగానీ.. ఆ హడావిడిలో బంగారంలాంటి సెల్‌ఫోన్ జారిపోయింది. ఇంటికొచ్చి చూసుకుంటే ఫోన్ లేదు. ఇక ఊర్వశి బాధ దేవుడికే ఎరుక. పాటకు లక్షల్లో పారితోషికాలు తీసుకునే ఈ బ్యూటీ, ఆఫ్టరాల్ ఓ సెల్ కోసం ఇంత బాధపడాల్సిన అవసరం ఏంటి? అనుకుంటున్నారా? సాధారణంగా సినీ సెలబ్రిటీలు ఎక్కువశాతం ఐఫోన్లనే వాడతారు. ఉర్వశిది కూడా ఐఫోనే. కాకపోతే, ఇది సాదాసీదా ఐఫోన్ కాదు, స్వచ్ఛమైన బంగారం ఫ్రేమ్‌తో చేసిన ఐఫోన్. చాలా తక్కువ సంఖ్యలో తయారయ్యే లిమిటెడ్ వెర్షన్ అది. దాంతో ఫోన్ దొరికితే వెంటనే సంప్రదించాలంటూ సోషల్ మీడియాలో విజ్ఞప్తులు కూడా చేస్తున్నది. ఆమె పోస్టులు చూసిన నెటిజన్స్ సరదాగా స్పందిస్తున్నారు. ఎవరికీ చెప్పకూడని రహస్యాలు ఏమైనా ఉన్నాయా? అంటూ సైటైర్లు వేస్తున్నారు.



## మనసుల్ని కట్టిపడేసే ప్రేమకథ

'డీజే టిల్లు'ఫేం సిద్ధు జొన్నలగడ్డ, రాశీఖన్నా, శ్రీనిధి శెట్టి ప్రధాన పాత్రధారులుగా రూపొందనున్న చిత్రానికి 'తెలుసుకదా' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన ఈ చిత్రం ద్వారా దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. పీపుల్ ఫ్యాక్టరీ పతాకంపై టి.జి.విశ్వప్రసాద్ నిర్మించనున్న 30వ చిత్రమిది. ఈ చిత్రం టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోను సోమవారం విడుదల చేశారు. నీరజ కోన మాట్లాడుతూ 'ఇది పూర్తి విందుభోజనం లాంటి సినిమా. సామాజికాంశాలు, అనుబంధాల నేపథ్యంలోసాగే కథ ఇది' అని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: ఎస్.థమన్.


శైలేష్ కొలను, నవాజుద్దీన్ సిద్ధిఖీ, వెంకటేష్, వెంకట్ బోయనపల్లి

## అధర్మానికి అడ్డునిలిచే సైంధవ్

'రొటీన్‌గా కాకుండా ఏదైనా కొత్త కథ చేయాలని చూస్తున్న సమయంలో శైలేశ్ 'సైంధవ్' కథ చెప్పాడు. ఈ కథలో భావోద్వేగాలకు ఎంత స్కోప్ ఉందో, యాక్షన్‌కి కూడా అంతే స్కోప్ ఉంది' అన్నారు అగ్రకథానాయకుడు వెంకటేశ్. ఆయన హీరోగా రూపొందుతున్న చిత్రం 'సైంధవ్. నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఆర్య, శ్రద్ధాశ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెరెమియా, సారా, జయప్రకాశ్ కీలక భూమికలు పోషిస్తున్న ఈ చిత్రానికి శైలేష్ కొలను దర్శకుడు. వెంకట్ బోయినపల్లి నిర్మాత. ఈ చిత్రం టీజర్‌ని సోమవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడారు. 'ఇందులో నా పాత్ర కథరీత్యా వైల్డ్‌గా ఉంటుంది. మాస్ ప్రేక్షకులకేకాక, ఫ్యామిలీ ఆడియన్స్‌కి కూడా నచ్చే సినిమా ఇది' అని వెంకటేశ్ నమ్మకం వ్యక్తం చేశారు. అన్నయ్యలాంటి వెంకటేశ్‌గారితో కలిసి పని చేయడం ఆనందంగా ఉందని నవాజుద్దీన్ సిద్ధిఖీ అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ- ' ప్రతిష్టాత్మకమైన వెంకటేశ్‌గారి 75వ చిత్రానికి దర్శకత్వం చేసే అవకాశం ఇచ్చిన నిర్మాత వెంకట్‌గారికి కృతజ్ఞతలు. మహాభారతంలో సైంధవుడు ధర్మానికి ఒక్కరోజు అడ్డు నిలిచాడు. నా సైంధవుడు అధర్మాన్ని అడ్డునిలుస్తాడు. అది ఎలాగనేదే ఈ సినిమా కథ ' అన్నారు.

## మా ఇద్దరి మధ్య గొడవలు అబద్ధం



కరీనా, ప్రియాంక.. ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. ఇది బాలీవుడ్ మాట. అప్పట్లో ఈ ముద్దుగుమ్మలు కలిసి 'ఐత్రాజ్' అనే సినిమాలో నటించారు. ఆ సినిమా నిర్మాణ సమయంలో వీరిద్దరూ సెట్‌లో పడి కొట్టుకున్నారని అప్పట్లో ఓ న్యూస్ బాగా వినపడింది. ఆ తర్వాత కూడా వీరిమధ్య అడపాదడపా గొడవలు జరిగాయని చెబుతుంటారు. ఎట్టకేలకు ఈ విషయంపై ఇన్నాళ్లకు స్పందించింది కరీనా. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఈ విషయంపై మాట్లాడింది కరీనా. 'ప్రియాంక, నేనూ కొట్లాడుకున్న మాట అవాస్తవం. మా ఇద్దరికీ ఎప్పుడూ గొడవ జరగలేదు. అప్పట్లో వృత్తిపరంగా మా మధ్య గట్టి పోటీ ఉండేది. ఇద్దరం నువ్వా నేనా అనేలా నటించేవాళ్లం. తగ్గట్టే మాకు మంచి పాత్రలు దొరికాయి. మా పోటీని చూసి, మాపై కొందరు లేనిపోనివి సృష్టించి రాసేవారు. అవే నిజమని ఇప్పటికీ కొందరు నమ్ముతున్నారు' అంటూ తన మనసులోమాట బయట పెట్టింది కరీనా. ఇంకా మాట్లాడుతూ ' సినిమా అంటేనే వైకుంఠపాళీ. ప్రతిసారీ ఇక్కడ గెలవలేం. ఒక్కోసారి ఘోరమైన ఓటములు ఎదురవుతాయి' అని చెప్పుకొచ్చింది.

## పల్లెటూరి దీపావళి



'స్రవంతి' రవికిషోర్ నిర్మించిన తొలి తమిళ చిత్రం 'కిడ'. ఆర్.కె.వెంకట్ దర్శకత్వం వహించారు. పూరాము, కాళీ వెంకట్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సినిమాను తెలుగులో 'దీపావళి' పేరుతో అనువదిస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో ఈ నెల 11న విడుదల కానుంది. 'ఓ తాత, ఓ మనవడు, ఓ మేక.. ఈ మూడింటి చుట్టూ కథ నడుస్తుంది. అందమైన ప్రేమకథ కూడా ఉంటుంది. గ్రామీణ నేపథ్యంలో హృదయాన్ని స్పృశించే భావోద్వేగాలతో ఆకట్టుకుంటుంది' అని చిత్ర బృందం పేర్కొంది. 'స్రవంతి' రవికిషోర్ మాట్లాడుతూ 'ఓ స్నేహితుడి ద్వారా ఈ కథ విన్నా. వెంటనే కనెక్ట్ అయ్యాను. తొలి చిత్రమైనా దర్శకుడు అద్భుతంగా తెరకెక్కించాడు' అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఎం.జయప్రకాష్, సంగీతం: థీసన్.



## జర్నలిస్టుల నేపథ్యంలో..

బాలీవుడ్ సీనియర్ హీరో మిథున్ చక్రవర్తి కుమారుడు మియో చక్రవర్తి తెలుగు ఇండస్ట్రీకి పరిచయమవుతూ నటిస్తున్న చిత్రం 'నేనెక్కడున్నా'. మాధవ్ కోదాడ దర్శకుడు. మారుతి శ్యాంప్రసాద్ రెడ్డి నిర్మాత. నవంబర్ 17న ప్రేక్షకుల ముందుకురానుంది. దర్శకుడు మాట్లాడుతూ 'జర్నలిజం, రాజకీయం నేపథ్య కథాంశమిది. సస్పెన్స్, థ్రిల్లింగ్ అంశాలుంటాయి. హీరో హీరోయిన్లు ఇద్దరూ జర్నలిస్ట్ పాత్రల్లో కనిపిస్తారు' అన్నారు.

